"పెళ్ళాల్ని పుట్టింటికి పంపించకూడదోయ్ మూర్తి! పుట్టింటికి వెళ్తే చాలు, మొగుళ్ళ సంగతి మరచిపోతారు." అన్నాడొకసారి తనతో నారాయణరావు. ఆలోచిస్తే, వాడి మాటలు నిజమేననిపిస్తుంది.

# తలబుద్ధి



కలింకోట ప్రభాకరదేవ

మా బామ్మరిది కొడుకు బారసాలకని వెళ్ళిన మా శ్రీమతి రెండువారాలు గడిచినా యింకా తిరిగిరాలేదు. ఇంట్లో ఒక్కడ్నీ, ఏంతోచడంలేదు. ఆఫీసునుండి యింటికి రాగానే బోసిపోయినయిల్లు నన్ను వెక్కిరిస్తున్నట్లుగా ఫీలింగు కలుగుతుంది నాకు. ఆ ఫీలింగును భరించడం రోజురోజుకు కష్టసాధ్యం అవుతుంది.

వెంటనే వచ్చేయమని వారంరోజుల కితం వుత్తరం వ్రాసాను. రెండురోజుల్లో వచ్చేస్తానని, ఏమీఅనుకోవద్దని వ్రాసింది. శ్రీమతి రావడానికిగాను పెట్టిన గడువు నిన్నటితోనే పూర్తయింది.

నిన్నంతా శ్రీమతికోసం ఎదురు చూస్తూనే గడిపాను. ఫలితం శూన్యం. ప్రాణం వుసూరుమనిపించింది! మా ఆవిడ మీద కోపమొచ్చినా కోపంకూడా వచ్చింది. ఐనా, ఏం చెయ్యగలను? అసలు, మా ఆవిడ నాముందు వుంటే గద!

ఆలోచనలు నన్ను నిద్రపోనివ్వటంలేదు. పదేపదే మాఆవిడ గుర్తుకువస్తుంది. ఎప్పుడూ యింతే. పుట్టింటికి వెళ్ళిందంటే, నెలరోజులుండివస్తుంది. ఎన్నిచెప్పినా, తిట్టినా రాజకీయనాయకుడిలా దులిపేసుకుని, మరచిపోతుంది.

చేతికున్న వాచీని చూసుకున్నాను, తొమ్మిదయింది. ఆకలిగా వుంది. కాని హోటలుకెళ్ళి భోజనం చెయ్యాలంటే బద్ధకంగా వుంది.

కూజాలోని నీళ్లను గాజు గ్లాసులోకి వొంపుకొని తాగాను. సిగరెట్టు వెలిగించాను. నా దృష్టి టేబులుమీదనున్న టెలిఫోను మీద పడింది. నా బుర్రలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

మా ఆవిడకి ఫోన్ చేస్తే...?

మరింకేం ఆలోచించలేదు.

గబగబా రెండువందల మైళ్ళ దూరంలో వున్న మా శ్రీమతికి — ఫోన్ నెంబరు డయిల్ చేసాను.

ఎక్స్చేంజివాళ్ల పుణ్యమా అంటూ పది నిముషాలకే కనెక్షను దొరికింది. అవతల ఫోన్ ఎత్తింది కూడా మా ఆవిడే. మా మావగారుగాని ఫోను ఎత్తితే కొంప మునిగిపోయుండేది. సవాలక్ష ప్రశ్నలతో ప్రాణాలు తీసేవాడు.

"ఎవరు కావాలండి?" మా శ్రీమతి కంఠం వీణ మీటినట్లుగా పలికింది.

"నేను పద్మా! మూర్తిని."

"మీరా? ఏమిటిలా ఫోన్ చేశారు?"

"మరేం లేదు. నాకు ఇక్కడ యేం తోచటంలేదు. అందుకని..."

"బుద్ధిలేకపోతేసరి. ఈమాత్రం దానికే ఫోను చెయ్యాలా? పది రూపాయలు దండగ" అంది కోపంగా.

మా ఆవిడ అర్థిక దృక్పథానికి నవ్వొచ్చింది నాకు.

"అది సరేగాని పద్మా! నిన్ననే వస్తానన్నావు. రాలేదేం?"

"మా అక్కకొడుకు నిన్ననే బొంబాయి నుండి వచ్చాడండి! వాడ్ని చిన్నప్పుడెప్పుడో చూశాను. అంతదూరంనుంచి వచ్చాడుకదా అని ......"

'ఓహో ... అర్థం అయింది. ఇంతకీ తమరు ఎప్పుడే వేంచేస్తారు? రేపు బయలుదేరకూడదూ?"

"సారి ...! రేపు మా యింట్లో సత్యన్నారాయణవ్రతం..."

"ఎల్లుండో ...?"

"కుదరదండి. ఎల్లుండి నా చిన్ననాటి స్నేహితురాలు వనజ పుట్టినరోజు."

"ఖర్మ ! ఇంతకీ తమరెప్పుడు వస్తారో సెలవియ్యండి."

"మరీ అంతకోపంగా మాట్లాడితే ఎలాగండి ? ఒక్కవారంరోజుల్లో వచ్చేయనూ ! ప్లీజ్...ఈ ఒక్కసారికే...ఏంఅనుకోకండేం"

"నిన్ను పంపించడం నాదే పొరపాటు."

"అలా అనకండి. ఇంతకీ మీరు వేళకి సరిగ్గా భోజనం చేస్తున్నారా?"

"నేను భోజనం చేస్తేనేం ? చెయ్యకపోతేం ఏం?? నామీదఅంత శ్రద్ధవున్న దానివయితే ఇన్నిరోజులక్కడ వుంటావా ?"

"మీకు కోపం ఎక్కువబాబు ! ఎన్నాళ్ళకో వచ్చానని-ఇక్కడ మావాళ్ళు ఒకంతట నన్ను వదలడంలేదు. నన్నేం చెయ్యమంటారు?"

"ఊఁ..."

"ఇంతకీ చెప్పారు కాదు ! వేళకి సరిగ్గా భోజనం చేస్తున్నారా? ఆరోగ్యం జాగ్రత్త."

"ఊ... హోటల్లో భోజనం చెయ్యాలంటే ఏడుపొస్తుంది ... పద్మా! త్వరగా వచ్చేయి."

"అలాగేనండి. ఒక్క వారం రోజులు ఓపిక పడుదురూ!'

"సర్లే... గుడ్‌నైట్!" విసురుగా ఫోను పెట్టేశాడు.

*  *  *

వారం రోజులయింది.

మా శ్రీమతి మాత్రం రాలేదు.

వాళ్ళ తమ్ముడు భార్యకి పురుడొచ్చిందట నాలుగు రోజులు వచ్చేసరికి ఆలస్యం అవుతుందని పుత్తరం వ్రాసింది.

అ వుత్తరం చదువుకొని, పిచ్చిగా జుత్తు పీక్కున్నాను. నారాయణతో నా బాధంతా చెప్పుకున్నాను

అంతా విని చిన్నగా నవ్వేడు. వాడు ఆడవాళ్ల సైకాలజీని బాగా స్టడీ చేశాడు.

"ఆడవాళ్లంతా యింతేనోయ్. ఒకసారి.. మా భార్యారత్నంకూడా యిలాగే నన్ను ఏడిపించాలనుకుంది కాని, నేను మా ఆవిడ ఆటలు సాగనివ్వలేదు" అన్నాడు స్టైయిలిష్‌గా.

"ఏం చేశావేమిటి?" ఆతృతగా అడిగాను.

## ఆడబుద్ధి

మా వాడు సిగరెట్ వెలిగించి, తాపీగా పొగ వదల్తూ చెప్పడం ప్రారంభించాడు.

నారాయణతో కొంతసేపు బాతాఖానీ కొట్టిన తరువాత, నా మనసు చాలా ఉల్లాసంగా ఉంది.

'క్వాలిటీ'కి వెళ్ళి భోజనంచేసి, తిన్నగా యింటికి వచ్చేసాను. టైం ఎనిమిదికావస్తుంది. చిన్నగా నవ్వుకొని, టెలిఫోన్‌ను దగ్గరకు తీసుకొని, నాకు కావలసిన నెంబరుకు రింగ్ చేశాను.

మా ఆవిడ లైన్‌మీదకు రాగానే

"నేను పద్మా ! మూర్తిని..."అన్నాను.

"ఏమిటలా ఫోన్ చేశారు? యింకా నేను రాలేదని కోపమా ?"

"కోపమా ? నాకెందుకు ??" అన్నాను అక్కసుగా.

"మీ మాటలబట్టే అర్థం అవుతుంది లెండి. ఇంకొక్క నాల్గురోజులేకదా ! కాస్త

పై వారమే
రాదారి పడవ
దీపావళి సీరియల్ కథ

ఓపిక పట్టేరంటే వచ్చేస్తాను. ప్లీజ్." అంది గోముగా.

"మరేం ఫర్వాలేదు డియర్ ! నాకిక్కడ బాగానేవుంది. హోటల్లో భోజనంగురించే భయపడ్డాడిని. ఇప్పుడా బాధ తీరిపోయింది. నీకు యిష్టం వచ్చినన్నిరోజులువుండు. నేనేం కోపగించుకోలేను..."

"భోజనం హోటల్లో చెయ్యడంలేదా ? కొంపదీసి స్వయంపాకం మొదలుపెట్టారేమిటి ?" నవ్వుతూ ప్రశ్నించింది.

"అంత ఓపిక నాకెక్కడిది ?"

"మరిఁ......?"

"మా ఆఫీసులో స్టెనోగా పనిచేస్తున్న అమ్మాయి నీకు తెల్సుకదా ?"

"ఆఁ...మేరీకదూ !?"

"అవును... ఆ అమ్మాయి నా అవస్థ చూసి, నువ్వు యిక్కడకు వచ్చేవరకూ తన యింట్లో భోజనం చెయ్యమని ఇన్వయిట్ చేసింది."

"ఏమిటి ? ఆ క్రిస్టియన్‌ల అమ్మాయి యింట్లో భోజనం చేస్తున్నారా?? రామ ... రామ."

"ఛ...అలా అంటావేం పద్మా ! మేరీ చాలా చక్కగా వండుతుంది. అక్కడంతా సదుపాయంగానే వుంది." అన్నాను.

"వుంటుంది...వుంటుంది ! నేను నాల్గురోజులు యింట్లో లేకపోయేసరికి మీకిదేం బుద్ధి? ఆ కిరస్తానిదానియింటికి మిమ్మల్ని ఎవరు వెళ్ళమన్నారు ? మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు."

' అదికాదు పద్మా! నువ్వు రావడం ఎలాగు కొన్నాళ్ళు ఆలస్యం అవుతుంది కదా అని... ......" నా మాటల్ని మధ్యలోనే తుంచేసింది

"అదేం కుదరదు రేపు మధ్యాహ్నమే మెయిల్‌లో వచ్చేస్తున్నాను." అందికోపంగా. నేను నవ్వుకున్నాను.

"మరి మీ తమ్ముడి భార్యకి పురుడొచ్చిందికదా ! నాల్గురోజులు వుండకపోతే ఏం బాగుంటుంది చెప్పు" అన్నాడు.

"అదంతా మీ కనవసరం. మీరు మాత్రం ఆ మేరీ యింటికి భోజనానికి మాత్రం వెళ్లకండి...వెళ్తే నే నొప్పుకోను."

"సర్లే. ఇంతకీ రేపు నువ్వు బయల్దేరడం ఖాయమేనా?" నారాయణ సలహా పనిచేస్తున్నందుకు ఆనందంతో అడిగాను.

"ఊఁ... ఏం మీకు బాధగా వుందా?" వ్యంగ్యంగా పలికింది మా ఆవిడ గొంతుకు.

"నాకెందుకు బాధ. స్టేషన్‌కు నిన్ను రిసీవ్ చేసుకోవడానికి వద్దామని అడిగాను అంతే."

"మీ మాయమాటలు నాకు తెలుసులెండి ఆ మేరీ యింటికెళ్తే నేనూరుకోను. హోటల్లోనే నేను వచ్చేవరకూ భోజనం చెయ్యాలి" అంది వార్నింగిస్తున్నట్లుగా.

"అలాగే పద్మా! రేపు బయల్దేరుతున్నావ్‌గా... గుడ్‌నైట్."

నారాయణకు మనసులోనే కృతజ్ఞత చెప్పుకుని, 'ఆడబుద్ధి'కి నవ్వుకుంటూ రిసీవర్‌ను పెట్టేశాను.